

# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



*(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)*

"గుడ్ మార్నింగ్ అనిల్! రెడీయేనా? వెళదామా? " అంది కార్ తో రెడీగా ఉన్న డ్రైవర్ ని చూస్తూ.

"గుడ్ మార్నింగ్ అమ్మా! రెడీ, రండి !" అంటూ డోర్ తెరిచి పట్టుకున్నాడు.

" ఇదే వద్దన్నాను, నువ్వెందుకు తలుపు తీసి పట్టుకోవడం. నేను తీసుకోలేనా!" చనువుగా అతన్ని చిన్నగా కసురుతూ లోపల కూర్చుంది.

"పరవాలేదమ్మా, ఇందులో ఏముంది?" నవ్వాడు అనిల్

" ఏ. సీ, పెంచనా అమ్మా, చాలా?" అడిగాడు అనిల్ సీట్ బెల్ట్ పెట్టుకుంటూ.

" చాలు అనిల్, బావుంది" అంటూ తనతో తెచ్చుకున్న కవర్లలోని ఫోటోలు తీసి చూసుకోవడం మొదలు పెట్టింది.

తాము పని చెయ్యబోయేది సిటీలోని పెద్ద ఇండస్ట్రీయలిస్ట్ అయిన శ్రీమతి కిరణ్ అగర్వాల్ వాళ్ళ స్పానిష్ విల్లా. చాలా పెద్దది. కిరణ్ యశోదకి స్నేహితురాలే. వాళ్ళు ఆ విల్లా కట్టించడం మొదలు పెట్టినప్పటినించీ యశోదకి దాన్ని గురించిన అన్ని విషయాలూ తెలుసు. దాని ప్లాన్, రూముల డిజైన్లు, గార్డెన్ నమూనాలూ అన్నీ యశోదకి తరచుగా చూపించేది కిరణ్ అగర్వాల్.

ఇప్పుడు తన స్నేహితురాలు కిరణ్ ఆ ఇంటి తోటనీ, టెర్రస్ నీ డిజైన్ చెయ్యడానికి పేరున్న పెద్ద ఏజెన్సీ ని కాక, తనని సంప్రదించడం, దగ్గరుండి తాను కోరిన విధంగా డిజైన్ చెయ్యమనడం యశోదకెంతో సంతోషాన్నిచ్చింది.

ఏదో సరదాగా మొదలుపెట్టిన తన చిన్న ప్రయత్నం ఇలాంటి పెద్దవారిళ్ళలోకి వెళితే తనని నమ్ముకుని ఉద్యోగం చేస్తున్న నలుగిరికి మరింత మేలు జరుగుతుందని ఆమె భావించింది. అందుకే చాలా శ్రద్ధగా వాళ్ళ విల్లానీ, దానికి నలుపక్కలా ఉన్న ప్రదేశాలనీ తన టీముతో సహా వెళ్ళి పరిశీలించి ఫోటోలు, వీడియోలు తీసుకుని వచ్చింది. ఆపైన, ఆ ఇంటి చుట్టుపక్కల తాము చెయ్యవలసిన పనిని ఆవిడ మూడు భాగాలుగా విభజించుకుంది. విల్లా ముందున్న తోట, వెనక భాగం లోని తోటా, కూర్చునే ఏర్పాట్లు, అలాగే టెర్రస్ మీద కావలసిన ఏర్పాట్లు. మళ్ళీ ప్రతీ ఒక్క విభాగానికి కనీసం నాలుగు రకాల డిజైన్లు ఉండేటట్టుగా రూపొందించుకుంది. కస్టమర్లకి ఎంచుకోవడానికి వీలైనన్ని ఆప్షన్స్ ఇవ్వాలన్నదే ఆమె ఉద్దేశ్యం.

స్నేహితురాలే అయినా ఏ విషయం లోనూ ఆమెకి మిగిలిన కస్టమర్లకి తక్కువ కాకుండా, ఇంకా చెప్పాలంటే ఒకింత ఎక్కువగానే మంచి సర్వీస్ ని ఇవ్వాలని ఆమె తాపత్రయం. అందులో ఏదైనా ఒకటి నచ్చితే సరే, లేదంటే కిరణ్, మరియు ఇతర కుటుంబ సభ్యులతో మరొక సారి మాట్లాడి తగ్గ మార్పులు చేసి డిజైన్లు రూపొందించి అందించాలని ఆమె ఆలోచన.

మొదటినించీ కిరణ్ అభిరుచులూ, ఇష్టాలు తనకి తెలుసు కనక తాను తీసుకువెళ్ళే వాటిల్లో ఏదో ఒకటి తప్పక నచ్చుతుందని అనుకుంటూ మరొకసారి అన్నింటినీ జాగ్రత్తగా పట్టి పట్టి చూసింది ఆవిడ.

తాము అనుకున్న డిజైన్లు, వెయ్యవలసిన మొక్కలూ, రెండు చిన్న జలపాతాలూ, గార్డెన్ లో పెడదామనుకుంటున్న బొమ్మలూ, కూర్చునే ఏర్పాట్లు, రాతితో కట్టాలనుకున్న బెంచీలూ, వెనక కనిపించే గోడలకు ప్రతిపాదించిన రంగులూ, ఎక్కడ ఎంత లైటింగ్ ఉండాలి? ఎలాంటి లైట్లు పెట్టాలి లాంటి వివరాలూ అన్నీ మరొకసారి తనిఖీ చేసుకుని తనకి తానే తృప్తిగా తల ఊపి, మళ్ళీ అన్నీ జాగ్రత్తగా కవర్లలో పెట్టుకుంది. ఆ కవర్ ని తన బాగ్ కింద పెట్టి తన పక్కనే పెట్టుకుంది.

మరో ఇరవై నిమిషాలు పట్టచ్చు తమ గమ్యం చేరడానికి.

"ఇల్లు గుర్తుంది కదా అనిల్?" అని అడిగి అతను 'ఉంది' అని చెప్పాకా, సీట్లో వెనక్కి జేరబడి విశ్రాంతిగా కళ్ళు మూసుకుంది.

ఆమె కళ్ళు మూసుకున్న మూడు క్షణలకి మళ్ళీ వచ్చింది నొప్పి.

ఎవరో గుండెలో కత్తి పెట్టి చురుక్కున చీల్చినట్టుగా, షార్ప్ గా.

ఛాతీ లోంచి భుజం వైపుకి ఒక్క పెట్టున వచ్చింది.

దానికి తోడు ఊపిరి స్థంభించినట్టయి, ఆయాసం రావడం మొదలై, శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది గా అనిపించడం మొదలైంది.

కొద్దిగా తల తిరుగుతున్నట్టుగా అనిపించి ఇబ్బందిగా కదిలింది ఆమె తన సీటులో.

ట్రాఫిక్ ని తప్పించుకుంటూ కార్ నడపడం లో మునిగి ఉన్న అనిల్ ఇవేమీ గమనించలేదు. దీక్షగా రోడ్డు మీదకే దృష్టి సారించి నడుపుతున్నాడు.

పొలమారినట్టయి చిన్నగా దగ్గు రావడం మొదలైంది ఆమెకి. తన పక్కనే ఉన్న సీసాలోంచి నీళ్ళు తాగింది.

రెండు మూడు సార్లు చిన్న గుక్కలుగా నీరు తాగి, ఛాతీ మీద నెమ్మదిగా రాసుకోవడం మొదలు పెట్టింది.

తల పైకి చాచి ఊపిరి అందుకునే ప్రయత్నం చేసుకోసాగింది. అలా కొన్ని క్షణాలకే ఆమెకి శ్వా స చిక్కినట్టై, ఊపిరి ఆడడం మొదలైంది.

నొప్పి కూడా నెమ్మదించించినట్టై మళ్ళీ మాములుగా అనిపించసాగింది.

దాంతో ఏదో కోల్పోయిన హాయి తిరిగి దొరికినట్టనిపించి ఉపశమనం గా అనిపించసాగింది.

కానీ అంతలోనే ' తన ఆరోగ్యం సరిగ్గా లేదని, ఏదో తెలియని విషయమేదో తనలో జరుగుతుందేమో' అన్న అనుమానం తొలిసారిగా ఆమెలో ప్రవేశించింది.

అలా అనిపించగానే ఆమెకి తెలియకుండా నే ఓ చిన్న భయం ఆమెలో ప్రవేశించింది.

" క్లయింట్ దగ్గరకి వెళ్ళడమా, ఈ కార్యక్రమం మానేసుకుని వెనక్కి ఇంటికి వెళ్ళిపోదామా?" అని ఒక్క క్షణం ఆలోచించింది. తను వెళ్ళే సమయానికి అక్కడకు చేరుకునే తన టీము తేలిగ్గా మేనేజ్ చెయ్యగలరు. తన ఆర్కిటెక్ట్ శ్రద్ధ, ఆమె సహాయకుడు ప్రనవ్ చాలా తెలివైన వాళ్ళు, చురుకైన వాళ్ళు. ప్రతీ ప్రాజెక్టునీ డిజైన్ నుంచీ, పూర్తి అయ్యేవరకూ ఎంతో సమర్ధవంతంగా నిర్వహిస్తారు .

' వాళ్ళు చూసుకుంటారు కదా, అక్కడికి వెళ్ళాకా మళ్ళీ దగ్గు లేదా నొప్పి వస్తే బావుండదేమో, అందుకే వెనక్కి తిరిగి వెళ్ళిపోదామా?' అనే రెండు మూడు సార్లు అనుకుంది.

అంతలోనే 'కేవలం రెండు గంటల మీటింగే కదా, ఏం పరవాలేదులే !' అనుకుని వెళ్ళడానికే నిశ్చయించుకుంది.

కిరణ్ వాళ్ళింటికి చేరేవరకూ కొద్ది కొద్దిగా నీరు తాగుతూ ఉంది.

ఆమె వెళ్ళేసరికే తన టీం ఆర్కిటెక్ట్ శ్రద్ధ అప్పటికే అక్కడికి చేరి ఉంది. తనతోటే ఉన్నాడు ప్రణవ్ కూడా.

ముగ్గురూ కలిసి కిరణ్ కి, ఆమె కుటుంబ సభ్యులకీ తాము తెచ్చిన ఫోటోలు, 3D ఏనిమేషన్ విడియోలు చూపించారు. శ్రద్ధ ఎప్పుడూ ప్రొజెక్టర్తో పాటే వస్తుంది. టెర్రస్ కి ఇచ్చిన మూడు డిజైన్లు, ముందు, వెనకా గార్డెన్ కి ఇచ్చిన వాటిల్లోంచి చెరో రెండు డిజైన్లు నచ్చాయి. వాళ్ళల్లో వాళ్ళు కొద్దిసేపు మాట్లాడుకుని తమ నిర్ణయం చెప్పారు.

అప్పటినించి మరో గంటసేపు వివిధ విషయాలను గురించి మాట్లాడి, అన్నీ ఫైనల్ చేశారు.

మొదటిసారే అన్నీ నచ్చడం చాలా సంతోషం, మూడు నాలుగు సార్లు వెనక్కీ, ముందుకీ వెళ్ళవలసిన అవసరం ఉండదు. అందుకే యశోదకి చాలా ఆనందంగా ఉంది. శ్రద్ధకి, ప్రణవ్ కి తర్వాత ఏం చెయ్యాలో తెలుసు కనక, ఆ విషయాలని వారికొదిలి తను ఇంటికి వెళతానని చెప్పి బయలుదేరింది యశోద.

" అనిల్! ఆఫీస్ కి వెళ్ళి సార్ ని తీసుకుని వెళదాం" అంటూ కార్లో కూర్చుంది.

కాసేపట్లోనే వారు కేశవరావు గారి ఆఫీసుకి చేరుకున్నారు. యశోద ఫోన్ కాల్ రాగానే అప్పటికే సిద్ధంగా ఉన్న ఆయన క్రిందకి వచ్చారు. ఆయన కూర్చోగానే భర్తతో క్లయింట్ ఇంట్లో సమావేశం ఎంత బాగా జరిగిందో, ఎలా సక్సెస్ అయిందో లాంటి వివరాలన్నీ చిన్న పిల్లలాంటి సంబరంతో చెప్పింది. ప్రతీ సఫలతా అంతే సంతోషాన్నిస్తుంది, దానిగురించి ఒకటికి రెండు సార్లు చెప్తే సంతోషం మరింత ఇనుమడిస్తుంది.

అవన్నీ తన కుటుంబంతో పంచుకోవడం ఆమెకెంతో సంతోషకరమైన విషయం.

వెలుగుతున్న కళ్ళతో, ఆనందం నిండిన ముఖంతో ఆమె తన సంతోషాన్ని వ్యక్తపరిచే తీరు కేశవరావుకెంతో ఇష్టం. ముఖ్యంగా అదే తొలి విజయమన్నట్టుగా అనుకునే ఆవిడ సంబరం.

ఆపకుండా మాట్లాడడం వల్ల  కొద్దిగా దగ్గు వచ్చింది మళ్ళీ.

నీళ్ళు తాగడానికి ఒక్క క్షణం ఆగింది .

" నీకేదో ఇన్ఫెక్షన్  సోకినట్టనిపింసోంది యశూ! నిన్న కూడా దగ్గావు. ఒక సారి డాక్టర్ దగ్గరికి వెళితే మంచిదేమో!" అన్నాడు.

" అయి ఉండచ్చు" అంది తేలిగ్గా.

అంటూనే మళ్ళీ కిరణ్ అగర్వాల్ ఇంట్లో సమావేశాన్ని గురించి, అక్కడి వాతావరణాన్ని గురించి చెప్పడం కొనసాగించింది దాదాపు ఇంటికి చేరేవరకూ.

మధ్య మధ్యలో దగ్గు వచ్చినప్పుడల్లా కొద్ది కొద్దిగా నీరు తాగుతూనే ఉంది.

ఇంటికి వచ్చాకా బట్టలు మార్చుకుని అలసిపోయినట్టుగా నిద్రపోయింది యశోద. తర్వాత రెండు మూడు రోజుల్లో ఆమె దగ్గు ఎక్కువయింది తప్ప తగ్గలేదు. పసుపు వేసిన పాలు, లవంగాల్లాంటివి వేసి కాచిన నీళ్ళు తాగడం లాంటి ఇంటి వైద్యాలు, అందుబాటులో ఉన్న మందులు వేసుకున్నా కూడా తగ్గుముఖం పట్టలేదు. రెండు మూడు రోజుల దగ్గుకే  చాలా నీరసపడినట్టనిపించింది ఇంట్లో అందరికీ. దాంతో డాక్టర్ దగ్గరకి వెళ్ళడం తప్పలేదు.

ఇన్ఫెక్షన్ లాగే ఉంది అని డాక్టర్ రాసిన యాంటీ బయాటిక్స్ కోర్స్ పూర్తయినా ఉపశమనం రాలేరు.

దానికి తోడు ఉండీ, ఉండీ వస్తున్న ఛాతీ నొప్పి తోడయ్యింది. ప్రతీ రెండు మూడు రోజులకొకసారి నొప్పి రావడం మొదలైంది. వచ్చిన ఉధృతిని బట్టి అది ఒక్కోసారి కొన్ని క్షణాలపాటు, మరికొన్ని సార్లు రెండు మూడు నిమిషాలపాటూ ఉండేది. ఉన్నంతసేపూ ఆమెని విపరీతమైన ఇబ్బంది పెట్టేది. ఎందుకు వస్తోందో, ఎలా తగ్గుతోందో వారి అంచనాకి తెలిసేది కాదు. దానికి తోడు దగ్గు. మూడు వారాలై నా  దగ్గు తగ్గలేదు సరి కదా, మరింత ఎక్కువై, రాత్రి పూట నిద్రకి అడ్డమైపోసాగింది.  వేళ కాని వేళలో ఉండుండి ఉధృతంగా రావడంతో  నిద్రాభంగం కావడం, ఆపైన చాలా సేపు తిరిగి నిద్రపోలేకపోవడం చాలా సాధారణమైపోయింది. కొద్దిరోజుల్లోనే ఆమె నొప్పి ఎక్కువై ఛాతీలోంచి, వీపువైపుకి పాకి తరచుగా  బాధించడం మొదలైంది.

దాంతో వెల్లకిలా పడుకోవడమే కష్టంగా మారింది. నొప్పి, దగ్గూ రెండూ ఒకేసారి వస్తే ఇంక చెప్పనవసరమే లేదు. తమ మంచం పక్కనే ఉన్న పెద్ద రిక్లైనర్ కుర్చీలో కూర్చుని శ్వాస చిక్కేవరకూ ఇబ్బంది పడేది .

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments